

సిపిఎం ఇంటింటా సర్వే...

పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించాలి

- సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు

సుందరయ్యనగర్‌లో పర్యటిస్తున్న సిపిఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు, నాయకులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: రాష్ట్ర ప్రభుత్వం గుట్టుచప్పుడు కాకుండా ఇతరాత్ర పేర్లతో ప్రజలపై మోపిన విద్యుత్ ఛార్జీలను వెంటనే ఉపసంహరించాలని సిపిఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపి పి.మధు డిమాండు చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో వినియోగదారులపై రాష్ట్ర ప్రభుత్వం చాపకింద నీరుల వేసిన విద్యుత్‌చార్జీల బాదుడుపై ఆదివారం తిరుపతి నగరంలో ఇంటింట సర్వే చేపట్టారు. సుందరయ్య నగర్‌లోని ఇంటింటికి వెళ్లి గతంలో వారికొచ్చిన కరెంట్ చార్జీ, మే నెలలో వారికి వచ్చిన విద్యుత్ బిల్లుపై ఆరా తీశారు. ప్రతి ఇంటిలోనూ ఏప్రిల్ నెలకంటే మే నెలలో రెండు, మూడు రెట్లు అధికంగా రావడాన్ని గమనించారు. ప్రజలు తాము ఈ భారాలను మోయలేకపోతున్నామని, కరెంట్ బిల్లు కట్టేందుకు ఉన్న ఇంటినే అమ్మేయాల్సిన పరిస్థితి వస్తోందని సిపిఎం నాయకుల ఎదుట తమ ఆవేదన వెలబోశారు. దీనిపై స్పందించిన మాజీ ఎంపి మధు మాట్లాడుతూ జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా భారాలను మోపడం బాధాకరమన్నారు. ఒక లైట్, ఒక ఫ్యాన్ ఉన్న ఇంటికి గతంలో 200 నుంచి 300 రూపాయల లోపు కరెంట్ బిల్లు వస్తే, జూన్‌లో 1258 రూపాయలు రావడం విడ్డూరంగా ఉందన్నారు. తమ సర్వేలో ప్రతి ఇంటి వద్ద బిల్లులను చూపుతూ వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. గత 10 సంవత్సరాల బిల్లులు ఒకేసారి మోపారని విమర్శించారు. ఈ బిల్లులు చెల్లించడం వినియోగదారులకు సాధ్యం కావడం లేదన్నారు. జగన్ ప్రభుత్వం కరెంట్ బిల్లులను ట్రూఅప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీలు ఇతరాత్ర పేర్లతో రెండు నుంచి మూడు రెట్లు పెంచేసిందన్నారు. అసలు బిల్లులు రూపొందించడంలో కూడా మోసం దాగుందన్నారు. అరియర్స్ పేరు చెప్పి అదనపు బిల్లులు వసూళ్లు చేస్తున్నారని, వినియోగదారులు ఈ దారుణాన్ని తట్టుకోలేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈ రోజు కేవలం ఒక కాలనీలోనే వినియోగదారులు పరిస్థితి ఇంత బాధాకరంగా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా వినియోగదారులు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. తిరుపతి నగర వాసులు విద్యుత్ ఛార్జీల బాదుడుపై పడుతున్న ఆవేధనను గమనించిన సిపిఎం సోమవారం తిరుపతిలోనే వినియోగదారులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. వినియోగదారులందర్నీ ఏకం చేసి జెఏసి ఏర్పాటు చేసి, ప్రభుత్వ తీరును నిరసిస్తూ పెద్దఎత్తున ఉద్యమిస్తామన్నిరు. ఇప్పటికైన ప్రభుత్వం దిగివచ్చి పెంచిన చార్జీలను ఉపసంహరించాలని డిమాండు చేశారు. లేని పక్షంలో బారీ నిరసనలు తప్పవని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఇంటింటి సర్వేలో వినియోగదారుల కడుపమంట బయటపడుతోందని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి సంక్షేమం అందిస్తే ఇలా ఉంటుందా అని ఎద్దేవా చేశారు. 2015 నుంచి 19వ వరకు ట్రూప్ ఆఫ్ చార్జీలు మోపారని, ఇప్పుడు మళ్లీ అదనపు భారం వేయడం శోచనీయమని అన్నారు. ప్రభుత్వ తీరుకు నిరసగా వినయోగదారులకు సిపిఎం అండగా ఉంటూ, పోరాడుతామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రదాన కార్యదర్శి కందారపు మురళీ, సిపిఎం నాయకులు టి.సుబ్రమణ్యం, వేణు, నాగార్జున, జయచంద్ర, ఆర్.లక్ష్మీ, సాయిలక్ష్మీ, నరేంద్ర, జయంతి, మాదవ్, బుజ్జమ్మ, గంగులప్ప, మునిరాజా, రమేస్, చినబాబు, లక్ష్మీదేవమ్మ, రాజా, సోము పాల్గొన్నారు.

చిన్నగదికి రూ.1200లు..

పట్టుమని పది అడుగుల విస్తర్ణం కూడా లేని చిన్నగదికి రూ.1200లు విద్యుత్ బిల్లులు వేయడం శోచనీయం. సుందరయ్య నగర్‌లోని డోర్ నెంబరు 19.6.42 గల చిన్న ఇంటిలో మల్లికార్జున తన కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. గతంలో ఈ ఇంటికి రూ.350లు విద్యుత్ బిల్లు వచ్చేది. ఈనెల 1258 రూపాయలు రావడం గమనార్హం. లలిత అనే ఆమె నివశించి రేకుల షెడ్‌లో ఒక ప్యాన్, లైటు, టివి మాత్రమే ఉన్నాయి, దీనికి నెలకు 300 రూపాయలు మించకుండా బిల్లు వచ్చేది. ఈ నెల ఏకంగా 800 రూపాయలు వేశారు. లక్ష్మీ అనే మహిళా స్థానికంగా బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఆమె సమీపంలో ఓ చిన్న గదిలో ఉంటోంది. ఉదయం 6 నుంచి రాత్రి 11 గంటల వరకు ఆమె ఇంటిలో ఉండదు.. రోడ్డు పక్కన బట్టలు ఐరెన్ చేసుకుంటుంది. రాత్రి పూట మాత్రం పడుకునేందుకు ఇంటికి వస్తుంది. ఈ ఇంటిలో ఒక ప్యాన్, లైట్ మాత్రమే ఉన్నాయి. గతంలో ఈ ఇంటికి 200 రూపాయలకు లోపే కరెంట్ బిల్లు వచ్చేది. ఈ నెలలో రూ.1028 రావడం విస్మనియం. ఇలా ఒకటి, రెండు కాదు. కాలనీలోని అన్ని ఇళ్లకు గతంతో పోల్చితో రెండు నుంచి మూడు రెట్లు అధికంగా మే నెల విద్యుత్ బిల్లుల రావడం విడ్డూరం.

ఇంటర్నేషనల్ పేర్లతో..

'ప్రైవేటు' బాదుడు

- కొత్త కోర్సులంటూ భారీ దోపిడీ
- ప్రాథమిక విద్యకు రూ.వేలల్లో వసూలు
- అడ్మిషన్లు పూర్తి అయినా చర్యలు శూన్యం

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: ఇంటర్నేషనల్ పేర్లు పెట్టుకుని కార్పొరేట్ విద్య పేరుతో విద్యాసంస్థలు చేస్తున్న వ్యాపారానికి అడ్డు అదుపు లేకుండా పోతుంది. ఫీజులు ఎంతో చెదితేనే విద్యార్థుల తల్లిదండ్రుల ఫ్యూజ్‌లు ఎగిరిపోయే పరిస్థితి నెలకొంది. జూన్ నెల వచ్చిందంటే చాలు తల్లిదండ్రుల గుండెల్లో భయం పెరుగుతోంది.. ఓ మాదిరి చిన్నపాటి ప్రైవేట్ స్కూల్‌లో 5వ తరగతి నుంచి ఏ తరగతిలో అడ్మిషన్ కావాలన్నా కనీసం రూ.50వేల నుంచి లక్ష వరకు ఉంటోంది.

ఇక క్లాసులు పెరిగే కొద్దీ ఫీజుల రేటు పెరుగుతుంది. అదే హాస్టల్‌లో సీటు కావాలంటే మరో లక్ష వరకు సమర్పించుకోవాల్సిందే.. కార్పొరేట్ స్కూల్ ఫీజులను మించి మరికొన్ని స్కూల్స్ అదే ఇంటర్నేషనల్ స్కూల్స్ అంటూ దుకాణాలు తెరిచాయి. తిరుపతి నగర శివారుల్లో ఇటీవల కాలంలో వెలసిన స్కూల్స్‌లో ప్రైమరీ చదువులకే రూ.2లక్షలు వరకు దండుకుంటున్నారు. అదే డేస్కాలర్ స్టూడెంట్‌కి అయితే రూ.1.50లక్షకు పెగా చెల్లించాల్సిందే. వందలు దాటి వేలాది అడ్మిషన్లు చేసుకుంటూ కోట్లు దోచేస్తున్నారు. ఫీజుల ద్వారా వచ్చిన డబ్బులు లెక్కించడానికి మిషన్లు, క్యాష్ లేకుంటే కార్డులు స్వైప్ చేయడానికి మిషన్లు, స్కానర్లు పెట్టేశారు. బ్యాంకులను మించిన స్కూల్స్‌లోని కౌంటర్లు డబ్బుతో కళకళలాడుతున్నాయి.. ఇదంతా చూస్తుంటే దోపిడీ ఏస్థాయిలో ఉందో అర్థమవుతోంది.

ఇదిలా ఉండగా ఫీజులను, అడ్మిషన్లను కట్టడి చేయాల్సిన విద్యాశాఖాధికారులు ఎవరూ అటు వైపు చూడకపోవడంతో ప్రైవేటు విద్యాసంస్థలకు అడ్డుఅదుపు లేకుండా పోతుంది. స్కూళ్లు తెరిచే వరకు ఎవరూ అడ్మిషన్లు చేయకూడదంటూ ఉచిత సలహాలు ఇస్తూ.. ఊరికే ఉన్నారు. స్కూల్స్ పునఃప్రారంభమైన వారం రోజులు గడవక ముందే సీట్లు ఫుల్ బోర్డు పెట్టేశారు. నిబంధనలు పాటించని స్కూల్స్ గుర్తింపు రద్దు చేస్తామన్న అధికారులు ఇంతవరకు ఏ ఒక్క స్కూల్‌పై కూడా చర్యలు తీసుకోకపోవడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం.

కొత్త కోర్సులు.. కొత్త ఫీజులు...

నగరంలోని పలు కార్పొరేట్ స్కూల్స్ కొత్త కోర్సుల పేరుతో తెగ ఫీజులు దోచేస్తున్నారు. ఓ పేరు మోసిన కార్పొరేట్ స్కూల్ యాజమన్యాం ఒలంపియాడ్, సి బ్యాచ్ అండ్ ఎస్ బ్యాచ్ అంటూ అడ్మిషన్లు తీసుకుంటోంది. 6వ తరగతి నుంచి 10 వరకు హాస్టల్ సీట్లు రూ.80 వేలు రూ.1.20లక్షల వరకు వసూళ్లు చేస్తున్నారు. అదేవిధంగా మరో కార్పొరేట్ స్కూల్స్, టెక్నో, ఐపిఎల్, ఐకాన్, ఎంపిఎల్ పేర్లతో రూ.70 నుంచి లక్ష వరకు ఫీజులు లాగేస్తున్నారు. ఇక హాస్టల్‌లో ఉండాలంటే మరో రూ.20 నుంచి 30వేలు అదనంగా చెల్లించాల్సిందే.. ఇంటర్నేషనల్ స్కూళ్ల ఫీజుల దోపిడితో పోలీస్తే ఫీజుల దోపిడి కాస్తా తక్కువే. అయితే అడ్మిషన్లు మాత్రం వీళ్లే టాప్. జిల్లా వ్యాప్తంగా పదుల సంఖ్యలో బ్రాంచ్‌లు ఏర్పాటు చేసుకుని వేలాది అడ్మిషన్లు చేసుకుంటున్నారు.

చర్యలేవి...

వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు తెరచుకున్నాయి.. స్కూల్ రీఓపెన్ అయిన ఐదు రోజులు అయ్యింది. అయితే అప్పుడే స్కూళ్లలో సీట్లు లేవంటూ బోర్డులు పెట్టేశారు. స్కూల్ పునఃప్రారంభం అయిన తొలివారం దాటకముందే అడ్మిషన్లు పూర్తి అయ్యాయని చెప్పేస్తున్నారు. జిల్లా అన్ని స్కూళ్లలో 60 శాతం నుంచి 80శాతం వరకు అడ్మిషన్లు పూర్తయ్యాయి. కొన్నిస్కూళ్లు ఉన్న పరిమితి సీట్లు మించి అంటే 100శాతం దాటి మరో 50శాతానికి పైగానే సీట్లు భర్తీ చేసుకున్నారు. స్కూళ్లు తెరిచిన నాటి నుంచే అడ్మిషన్లు చేయాలని ఎవరు నిబంధనలు అతిక్రమించడానికి వీలేందంటూ ఇటీవల విద్యాశాఖధికార్లు ప్రకటనలు చేశారు. రూల్స్ బ్రేక్ చేసిన స్కూళ్లు గుర్తింపు రద్దుచేస్తామని విద్యాశాఖధికారుల ఉత్తొత్తి ప్రకటనలు చేశారు. అయితే ఏస్కూల్ పైనా చర్యలు తీసుకున్న దాఖలు లేవు. అడ్డగోలుగా సాగుతున్న ఫీజులు దందాపై, అడ్మిషన్ల జాతరను కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.

జేఈఈ మెయిన్స్‌లో జశ్విన్ సత్తా

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి:

విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాయలసీమ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ జయభారత్ రెడ్డి కుమారుడు మాండవ్యపురం జశ్విన్‌రెడ్డి సత్తా చాటాడు. జేఈఈ మెయిన్స్‌లో 99.96 శాతం మార్కులు సాధించి ఆలిండియా స్థాయిలో 494 ర్యాంకును సాధించాడు. అదేవిధంగా ఏపీ ఎంసెట్లో 225 ర్యాంకు, తెలంగాణ ఎంసెట్ ఫలితాలలో 513వ ర్యాంకు సాధించి శ్రీకాళహస్తికి తీసుకొచ్చాడు. అదేవిధంగా ఆదివారం విడుదలైన ఐఐటి అడ్వాన్స్ ఫలితాలలో ఆల్ ఇండియా పరిధిలో 124వ ర్యాంక్, జనరల్ ఆల్ ఇండియా పరిధిలో 1376 ర్యాంకు సాధించి తల్లిదండ్రులకు పేరు తీసుకొచ్చాడు. మద్రాస్ ఐఐటీలో కంప్యూటర్ సైన్స్, లేకుంటే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదవాలన్నది తన అభిలాష అని జశ్విన్ తెలిపాడు.

జెఈఈ అడ్వాన్సడ్- 2023 ఫలితాలలో

నారాయణ ప్రభంజనం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ:

శనివారం ప్రకటించిన జెఈఈ అడ్వాన్స్ ఫలితాలలో తమ విద్యార్థులు టాప్ ర్యాంకులతో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారని నారాయణ విద్యాసంస్థల డీజీఎం కొండలరావు తెలిపారు. స్థానిక ఎంఆర్ పల్లిలోని నారాయణ క్యాంపస్‌లో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమ విద్యార్థులు ఓపెన్ కేటగిరి విభాగంలో బాబు సుజన్ రెడ్డి 34, మిఖిల్ 71, శశాంక్ రెడ్డి 90, కతి 698, భువనచంద్ర 801, వింధ్య 1007, ప్రేమ చంద్రారెడ్డి 1331, జస్విన్‌రెడ్డి 1376, వెంకట ప్రణతి 1404, మనోజ్ కుమార్ 1722, తనుష్ కుమార్‌రెడ్డి 1947, ప్రియ 2260 వంటి ర్యాంకులతో మొదటి వందలో మూడు, మొదటి వెయ్యిలో ఐదు, ఐదు వేలలోపు 16, పది వేలలోపు 26 ర్యాంకులు ఓపెన్ కేటగిరీ లోనే సాధించి రికార్డు సష్టించారని తెలిపారు. తమ విద్యార్థులు దాదాపు 40కి పైగా ఐఐటి, వందకు పైగా నీట్, ఐఐఐటి సీట్లు సాధించగలిగే అవకాశముందని వెల్లడించారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అబినంధించారు. వారికి సహకరించిన అద్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో కోర్ డీన్ శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపకులు విజయ్ కుమార్, సందీప్, శ్రీనివాస్, చిట్టిబాబు, దుర్గా ప్రసాద్, విద్యార్తులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏజి అండ్ పి గ్యాస్ నిర్వాహకుల నిర్లక్ష్యం..

గుంతలోపడ్డ యువకులు

- రాత్రంతా బైక్‌తో పాటు బురదలోనే...
- తప్పిన ప్రాణాపాయం
- పట్టించుకోని గ్యాస్ నిర్వాహకులు

ప్రజాశక్తి- గూడూరు:

ఏజీ అండ్ పీ గ్యాస్ నిర్వాహకుల నిర్లక్ష్యంతో ఇద్దరు యువకులు గుంతోపడి రాత్రంతా బురదలోనే ప్రాణాలను కాపాడుకోవటానికి కొట్టుమిట్టాడారు. ఉదయం స్థానికులు చూసే వరకు వారు అలాగే ఊపిరి నిలుపుకున్నారు.. చివరికి 108సాయంతో ఆసుపత్రిలో చేర్చి వైద్యం అందించడంతో ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు.. ఇంత జరిగినా గ్యాస్ నిర్వాహకులు మాత్రం తమకు ఏమీ పట్టనట్టు వ్యవహరించడం గమనార్హం..

స్థానికుల సాయంతో ప్రాణాలతో బటయపడ్డ యువకులు

గూడూరు నేషనల్ హైవే నుంచి పట్టణంలోకి వచ్చే మార్గంలో హోండా షోరూం పక్కన ఈప్రమాదం జరిగింది. గ్యాస్ పైపుల ఏర్పాటుకు సంబంధిత కాంట్రాక్టర్లు రోడ్డు పక్కన గొయ్యి తవ్వి నిర్లక్ష్యంగా వదిలేశారు. ఇటీవల వర్షాలు పడటంతో గుంతల్లో నీరు చేరి బురదతో నిండిపోయాయి. కనీసం చుట్టుపక్కల ఎటువంటి ప్రమాద సూచికలు లేకపోవడంతో శనివారం రాత్రి 10గంటల సమయంలో వ్యక్తిగత పనులపై గూడూరు పట్టణం నుంచి చిల్లకూరు వైపుగా వెళ్తున్న ఇద్దరు యువకులు వంజివాక మోహనకష్ణ (మైఖేల్), వంశీలు అదుపు తప్పి గుంతలో పడిపోయారు. గుంత లోతుగా ఉండటంతో పైకి రావడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో రాత్రి మొత్తం బురదలోనే తల మాత్రం పైకి పెట్టి ఊపిరి బిగబట్టుకుని ప్రాణాలను నిలుపుకున్నారు. ఉదయం అటుగా వచ్చిన స్థానికులు యువకులను గుర్తించి బురద గుంత నుంచి వెలుపలకు తీసి 108 ద్వారా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అనంరతం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గూడూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇంత ప్రమాదం జరిగినా నిర్వాహకులు మాత్రం ఏమీ తెలియనట్లు బాధితులను పట్టించుకోకపోవడం గమనార్హం.

లెర్న్ టుడే.. లీడ్.. టుమారో...

చదువులో సంచలనం సృష్టిస్తున్న హోలీ గ్రీన్



ప్రజాశక్తి- తిరుపతి సిటీ: లెర్న్ టుడే... లీడ్ టుమారో... అనే నినాదంతో ముందుకెళ్లుతూ.. చదువుల్లో తమ అనుభవాలను రంగలించి, విద్యార్థులకు బోధిస్తూ అత్యుత్తమ ఫలితాలతో హోలీ గ్రీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ సంచలనం సృష్టిస్తోందని ఆ స్కూల్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ మురళీ తెలిపారు. స్థానిక తిరుచానూరు రోడ్డులోని శ్రీనివాసపురం వద్దనున్న ఆ స్కూల్ ప్రాంగాణంలో వారు 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ సేవా దృక్పథం కల్గిన అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందం, నాణ్యతతో కూడిన బోధన విధానం అనుచరిస్తున్నామన్నారు. పాఠ్యాంశాలకు సంబంధించిన సమగ్రమైన స్టడీ మెటీరియల్, దానికి అనుబంధంగా వర్క్‌షీట్స్ అందిస్తున్నామని తెలిపారు. విద్య పరంగా వెనకంజులో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద చూపిస్తూ, విద్యతోపాటు లలిత కళలలో అభిరుచిని పెంపొందించడానికి మ్యూజిక్, డ్యాన్స్ తరగతులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థికి అదనపు సమాచారం అందించడం కోసం చక్కటి లైబ్రరీ సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. మానసిక వికాసానికి, ప్రశాంతతకు యోగా తరగతులు నిర్వహించడం, విద్యార్థుల పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయడానికి తరుచుగా తల్లిదండ్రులు, టీచ్చర్లతో కాన్పెరెన్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థి విద్యా సమాచారం తెలియజేసేందుకు తల్లిదండ్రులకు మొబైల్ యాప్ సౌకర్యం ఏర్పాటు చేశామని తెలిపారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయ బృందంతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో, విశాలమైన ప్రాంతంలో హోలీ గ్రీన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ నెలకొల్పామన్నారు. 2023 పదో తరగతి పరీక్షా ఫలితాల్లో తమ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని, పి.మనస్వీని 593/600, డి.జహ్నవి 589, ఎం.పుణ్య కీర్తనా 586, ఎస్.కల్యాన చక్రవర్తి 580మార్కులతో స్కూల్ టాపర్లగా నిలిచారన్నారు. ప్రస్తుతం ఒకటి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 8333830044, 83338 30055 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రత్యేకతలు

- స్మార్ట్ బోర్డు ద్వారా విద్యాబోధన
- మ్యాథ్స్, సైన్స్, కంప్యూటర్‌కు సంబంధించిన ల్యాబ్ సౌకర్యం
- ప్రతి తరగతికి కేవలం 30 మంది విద్యార్థులు మాత్రమే
- కోరీగ్రాఫీ, ఇంగ్లీష్ కమ్యూనికేషన్ స్కిల్స్‌పై ప్రత్యేక శ్రద్ధ
- ఆన్‌లైన్ ఎగ్జామ్స్, ఐఐటి, జెఈఈ, నీట్, సివిల్స్‌కు ప్రత్యేక శిక్షణ
- అటెండెన్స్, హోమ్‌వర్క్, మంత్‌లాగ్, ఎగ్జామ్ షెడ్యూల్, ప్రోగ్రస్
- అన్ని తరగతులు డిజిటలైజడ్
- ఎడ్యుకేషన్, డిసిప్లేన్, వ్యాల్యూవ్స్, స్పోర్ట్, ఫైన్ ఆర్ట్స్

సిపిఎస్‌ను రద్దు చేయాలి: యుటిఎఫ్

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: ప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన సమావేశంలో సిపిఎస్‌ను రద్దుచేసి జిపిఎస్‌ను తీసుకొస్తామని చేసిన ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని, పాత పెన్షన్ పునరుద్ధరించడం ఒక్కటే మార్గమని తాము కోరుకుంటున్నట్లు యుటీఎఫ్ తిరుపతి జిల్లా కార్యవర్గ సమావేశం డిమాండ్ చేసింది. ఆదివారం తిరుపతి యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో అధ్యక్షులు రాజశేఖర్ అధ్యక్షతన జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి ఎస్-ఎస్.నాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చిన విధంగా పూర్తిస్థాయిలో పాత పెన్షన్ను పునరుద్ధరించాలని, ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులందరికీ ఒకే విధమైన పాతపెన్షన్ కొనసాగేటట్లు చూడాలని డిమాండ్ చేశారు. జిపిఎస్ విధానం సరైంది కాదని, దీన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. అలాగే పాఠశాలల విలీనాన్ని వెనక్కి తీసుకోవాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. బాలికల కోసం ప్రారంభించిన హైస్కూలు ప్లస్ తరగతులకు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేసి అవి పూర్తిస్థాయి కాలేజీ వసతులతో కొనసాగేటట్లు చూడాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, ముత్యాలరెడ్డి, గౌరవాధ్యక్షులు శేఖర్, సహాధ్యక్షులు కెఎస్‌బి సూర్యప్రకాష్, శ్రీదేవి, కోశాధికారి రమేష్ నాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవరాల నిర్మల, జిల్లా నాయకులు దండు రామచంద్రయ్య, కుమారస్వామి, బండి మధుసూదన్‌రెడ్డి, హరిబాబు, శేఖర్, వాసుదేవరావు, రామమూర్తి రాజు, మస్తానయ్య పాల్గొన్నారు.

ప్రేమికుడే మా చెల్లెలను చంపేశాడు..

మృతురాలి అక్క ఆవేదన

ప్రజాశక్తి- తిరుపతి సిటి

ప్రేమ పేరుతో తన చెల్లి వెంట పడుతున్న ప్రేమికుడే తన చెల్లెలను చంపేశాడని మృతురాలి అక్క పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా టంగుటూరు మండలానికి చెందిన కల్యాణ్‌బాబు, మల్లీశ్వరి దంపతులకు నలుగురు సంతానం. సౌజన్య, మణిమాల తిరుపతిలో స్థానికంగా ఓ సూపర్ మార్కెట్‌లో పని చేసుకుంటూ సౌజన్య పిజి చదువుతోంది. ఏడాది క్రితమే వాళ్ల నాన్న మృతి చెందడంతో అక్కతో పాటు మణిమాల కూడా తిరుపతికి వచ్చి, రేణిగుంట వద్దనున్న ఓకంపెనీలో పనిచేసుకుంటూ అక్కతో నివశించేది. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తికి చెందిన మనోజ్ అనే కుర్రాడితో మణిమాలకు పరిచయం అయ్యింది. అది కాస్త ప్రేమగా మారింది. శనివారం ఉదయం సూపర్ మార్కెట్‌లో మొదటి షిఫ్ట్ విధుల కోసం మణిమాల ఇంటి నుంచి వెళ్లింది. అదే సమయంలో రెండో షిఫ్ట్ డ్యూటీకి వెళ్లే అక్క ఇంటిలో నిద్రిస్తోంది. చెల్లెలు డ్యూటీకి అని వెళ్లిన తర్వాత ఉదయం 9 గంటల ప్రాంతంలో సౌజన్య ఫోన్‌కు మణిమాల సెల్ నుంచి నిమిషం నిడివిగల వీడియో వచ్చింది. నిద్రమత్తులో ఆమె దాన్ని గమనించలేదు. ఇది జరిగిన కేవలం అర్ధగంటలోనే ఆమె గుర్తు తెలియన నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. మణిమాల ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుందని, ప్రాణాపాయస్థితిలో రుయాలో చేర్చామని సమాచారం వచ్చింది. హుటాహుటీన అక్కడికి వెళ్లిన సౌజన్యకు బెడ్‌పై తన చెల్లెలు మణిమాల ప్రాణాప్రాయస్థితిలో ఉండడాన్ని చూసి బోరున విలపించింది. 90శాతం గాయాలైన మణిమాల పరిస్థితి విషమించడంతో సాయంత్రం 5.45గంటలకు మృతి చెందింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఒంగోలు నుంచి తిరుపతికి చేరుకుని బోరున విలపించారు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం జరగాల్సి ఉంది. తన చెల్లెలను ప్రేమించిన వ్యక్తే పెట్రోల్ పోసి హత్యచేసి ఉంటాడని, అతన్ని అరెస్టు చేసి, పూర్తి స్థాయిలో విచారణ జరిపి మా కుటుంబానికి న్యాయం చేయాలని అంటూ మృతురాలి అక్క సౌజన్య తిరుపతి రూరల్ (ఎంఆర్ పల్లి) పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. దీన్నిపై పోలీసులు పెద్దగా స్పందించకపోవడం గమనార్హం. మణిమాల మృతిపట్ల పోలీసులు స్పందించి, పూర్తిస్థాయిలో విచారణ జరిపి, నిజనిజాలు వెలికి తీయాలని పలు మహిళా, ప్రజా సంఘాలు కోరుకుంటున్నాయి.

జూడో రాష్ట్ర విజేతలకు అభినందన

ప్రజాశక్తి- తిరుపతి సిటీ: టిటిడి బోర్డ్ సభ్యులు పోకల అశోక్ కుమార్, జెన్ అకాడమి అధ్యక్షులు రాజేష్‌లు రాష్ట్ర ఓపెన్ కేడెట్ జూడో పోటీలకు ముఖ్య అతిధిగా విచ్చేసి విజేతలకు అభినందనలు తెలిపారు. తిరుపతికి రాష్ట్రస్థాయి జూడో పోటీలు ఇచ్చిన రాష్ట్ర జూడో సంఘం అధ్యక్షులు ఆనం రామ కిశోర్‌రెడ్డి, కార్యదర్శి బద్దుల శ్రీధర్, జెఎఫ్ఐ నుండి అబ్జర్వర్ ఉమేష్ కుమార్ సింగ్, రాంబాబు, కెఎన్.బాబులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రపోటీలో గెలుపొంది జాతీయ స్థాయికి వెళ్లే రాష్ట్ర జట్టుకు క్యాంప్ నిర్వహిస్తామని అధ్యక్షులు రాజేష్ ఈ సందర్భంగా వెల్లడించారు. రాష్ట్ర పోటీలను విజయవంతంగా నిర్వహించినందుకు డాలర్స్ గ్రూప్ దివాకర్‌రెడ్డి, రాజేష్, భానుప్రకాష్ రెడ్డి, కిరణ్ కుమార్‌లకు పోకల అశోక్‌కుమార్ అభినందనలు తెలిపారు. జులై 5 నుండి 10 వరకు కర్ణాటకలో జరుగు జాతీయస్థాయి పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులను ఆనం రామ కిషోర్ రెడ్డి సత్కరించారు. బాలికల విభాగంలో సౌమ్య రాణి, పూజిత, వైష్ణవి, మహిత, జ్యోష్న, పూజితబాయి, యశోద, హారిక పాల్గొంటారు. అలాగే బాలుర విభాగంలో యువరాజ్, చిన్న, పుల్లారెడ్డి, విష్ణు, షాహుల్, గోవర్ధన్, వరుణ్ కుమార్, సాయి కిరణ్‌లు పాల్గొంటారని తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎస్పీ

జర్నలిస్టు జట్టుపై పోలీస్ జట్టు విజయం

ప్రజాశక్తి - క్యాంపస్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలంటే క్రీడలు ఎంతో అవసరమని తిరుపతి జిల్లా ఎస్పీ పి. పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. క్రీడల వలన మానసిక ఉల్లాసం, శారీరక దఢత్వం, చురుకైన ఆలోచన వంటి ప్రయోజనాలు చేకూరుతాయని ఆయన అన్నారు. ఆదివారం స్థానిక ఎస్వియూ క్రీడా మైదానంలో జిల్లా పోలీస్ స్ట్రైకర్స్, జర్నలిస్ట్ సూపర్ కింగ్స్ క్రికెట్ జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి బ్యాటింగ్‌తో, డీఎస్పీ యశ్వంత్ బౌలింగ్‌తో మ్యాచ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ నిత్యం పని ఒత్తిడిలో ఉండేది పోలీస్, మీడియా నేనన్నారు. పని ఒత్తిడిని అధిగమించి ఆరోగ్యవంతమైన జీవితాన్ని పొందాలంటే క్రీడలతోనే సాధ్యమవుతుందన్నారు. సాధారణంగా పోలీస్, మీడియా మిత్రుల జీవితంలో వారివారి దినచర్యలో భాగంగా పనులతో చాలా బిజీగా ఉంటారన్నారు. క్రీడలు కోసమని సమయాన్ని కేటాయించి ఇలా పాల్గొనడం ఆనందించదగ్గ విషయం అన్నారు. ఇదే క్రీడా స్ఫూర్తిని ప్రతి విషయంలో కూడా చూపిస్తూ వారివారి విధులల్లో ఉత్తమమైన సేవలను అందించాలన్నారు. క్రమశిక్షణకు మారుపేరుగా నిలిచే పోలీసులు విధులు కష్టమైన ఇష్టంగా భావించి ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలని ఆయన కోరారు.

జర్నలిస్టు జట్టుపై పోలీస్ జట్టు విజయం..

జిల్లా పోలీస్ స్ట్రైకర్స్, జర్నలిస్ట్ సూపర్ కింగ్స్ టీమ్స్ మధ్య జరిగిన టి-20 మ్యాచ్‌లో పోలీస్ జట్టు 57 పరుగుల తేడాతో జర్నలిస్ట్ జట్టు పై ఘనవిజయం సాధించింది. మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న పోలీస్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 207/5 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. బ్యాటింగ్‌లో సీఐ శివప్రసాద్ 27, మధు 57నాటౌట్, రాఘవ 39, హరి 31 పరుగులతో రాణించారు. బౌలింగ్లో కెప్టెన్ శ్రీనివాసులు రెండు, చిన్న బాబు, సి.శ్రీనివాసులు చెరో వికెట్ తీసుకున్నారు. అనంతరం 208 పరుగుల విజయలక్ష్మీతో బరిలోకి దిగిన జర్నలిస్టు జట్టు మొదట్లో తడబడినప్పటికీ తర్వాత కొంచెం పుంజుకుని నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 150 పరుగులు చేసి ఓటమిపాలైంది. కెప్టెన్ శ్రీనివాసులు 57 నాటౌట్, చిన్న బాబు18, సతీష్ 32తో రాణించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో పోలీస్ జట్టు జర్నలిస్టు జట్టుపై 57 పరుగుల తేడాతో విజయం సాధించింది. మ్యాచ్‌లో విన్నర్స్, రన్నర్స్‌గా నిలిచిన జట్లకు శాంతిభద్రతల అదనపు ఎస్పీ కులశేఖర్, చంద్రగిరి డిఎస్పి యశ్వంత్, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ ట్రోఫీలను అందజేసి క్రికెట్ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రోత్సాహ బహుమతులను అందజేశారు.

విద్యార్థినికి రోటరీ క్లబ్ చేయూత

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో డీఎస్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో ఇంటర్ ఉత్తీర్ణత సాధించి ఇంజినీరింగ్‌కు వెళ్తున్న నిరుపేద విద్యార్థినికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని డాక్టర్ జనార్దన్ రెడ్డి, డాక్టర్ రోహిణి చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బండి ధనుంజయ రెడ్డి మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ సభ్యుల సహాయ సహకారాలతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు వాసు గౌడ్, సేగు శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, హరినాథ్ రెడ్డి, ప్రజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మ్యూజిక్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగలోని సహజ సంపద సంస్థ అధినేత సురేష్‌నాయుడు భాగస్వామ్యంతో ఈనెల 21 న బుధవారం జరిగే అంతర్జాతీయ యోగా, సంగీత దినోత్సవాన్ని పురస్కరించుకుని డైనమిక్ యోగా అండ్ మ్యూజిక్ ఫెస్టివల్ కు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని డైనమిక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బొప్పన శ్రీనివాస్ తెలిపారు. సహజ సంపద సంస్థ భాగస్వామ్యంతో సత్యవేడు నియోజకవర్గ చరిత్రలో మొదటిసారిగా ఈ తరహా వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. స్థానిక పూజిత బాలికల జూనియర్ కళాశాలలో ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగనున్న ఈ వేడుకల్లో భాగంగా యోగా సాధన తో పాటు సింగర్ పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. అన్ని వయసుల వారు పాటల పోటీలలో పాల్గొని తమ గాత్ర ప్రతిభను చాటుకోవచ్చని వెల్లడించారు. సంగీతంపై అభిరుచి కలిగిన వారందరినీ ఓ వేదికపైకి తీసుకొచ్చి వర్ధమాన కళాకారులను ప్రోత్సహించాలన్నది తమ ఉద్దేశమన్నారు. సమావేశంలో సహజ సంపద సంస్థ స్థాపకులు సురేష్ నాయుడు, డైనమిక్ ఫౌండేషన్ ప్రతినిధులు బాలకష్ణ, రామ సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-దొరవారిసత్రం: తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తలపెట్టిన యువగలం పాదయాత్రను విజయవంతం చేయాలని సూళ్లూరుపేట నియోజకవర్గం పరిశీలకులు ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే కంభం విజయ రామిరెడ్డి అన్నారు. ఆయన ఆదివారం దొరవారిసత్రం మండలం కుప్పారెడ్డిపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన టిడిపి నాయకులు, కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24, 25 తేదీలలో నారా లోకేష్ బాబు సూళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో జరుగనున్న యువగలం పాదయాత్ర, బహిరంగ సభను జయప్రదం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి విజేత, తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి, దొరవారిసత్రం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసనాయుడు, మండల ఎస్సీసెల్ అధ్యక్షులు జకరయ్య, సర్పంచ్ మురళీకష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యులు శ్రీహరిరెడ్డి, మాజీ సర్పంచి కష్ణమూర్తి, మాజీ ఎంపీటీసీలు ఉదయ్ కుమార్, కిషోర్, ఏ కోళ్ల పంచాయతీ గ్రామ కమిటీ అధ్యక్షులు గోపాల్ రెడ్డి, నాయకులు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, రవి నాయుడు, కిషోర్ నాయుడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి కష్టపడితే గుర్తింపు తప్పనిసరి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : పార్టీకి కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని.. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఆదివారం వడమాలపేట మండలం తట్నేరిలోని ఆశ్రమంలో టిసి అగ్రహారం సచివాలయ కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కార్యకర్తను మన నాయకుడు జగనన్న మర్చిపోరని.. జగన్మోహన్ రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిని చేద్దామని సూచించారు. కార్యక్రమంలో వడమాలపేట మాజీ జడ్పీటీసీ సురేష్‌రాజు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాకాలలో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి-పాకాల: తిరుపతిలోని కీర్తి న్యూరో హాస్పిటల్ సహకారంతో లయన్స్ క్లబ్ మ్యాంగో దామలచెరువు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్య శిబిరం నిర్వహించారు. 149 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్లు ఏ యస్ కీర్తి, డాక్టర్ శివకుమార్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ లావణ్య, డాక్టర్ మల్లికార్జున ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ నాగూర్ బాషా, జయచంద్ర, ఆర్.పి నాగోర్, ఆనంద,సైదుల్ల, జీవి నాగోర్, మహమ్మద్, కేవస్ మస్తాన్, రామయ్య పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం.. అన్వేష్ విజయం

▶ వికలత్వాన్ని ఎదిరించి లక్ష్యసాధనకు ప్రయత్నం ▶ రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఆటల్లో పతకాలు
▶ దివ్యాంగులకు ఆదర్శం .. గూడూరు యువకుడు

ఆత్మవిశ్వాసంతో ముందుకెళితే అవయవ లోపం అడ్డుకాదని..అవమానాలు ఎన్ని ఎదురైనా లక్ష్య సాధనే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాడు గూడూరు పట్టణానికి చెందిన ఓ దివ్యాంగుడు. ప్రమాదవశాత్తు ఎడమ చేయి తీసివేసినా తన ఆశయం దిశగా ముందుకెళ్లడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. పారా స్పోర్ట్స్ క్రీడాపోటీల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు సాధించి పలువురు దివ్యాంగులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు గూడూరుకు చెందిన యువకుడు అన్వేష్.

ప్రజాశక్తి - గూడూరు

గూడూరు పట్టణంలోని చర్చి వీధి ప్రాంతంలో నివాసం ఉంటున్న దంపతుల కుమారుడు అన్వేష్ చిన్నతనం నుండే క్రీడలపై ఎంతో మక్కువ చూపుతున్నాడు. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు వ్యాయామ ఉపాధ్యాయులు వీరరాఘవులు, జానకిరాముల ప్రోత్సాహంతో వాలీబాల్, రెజ్లింగ్, డిస్కస్‌త్రో క్రీడల్లో రాణించి గుర్తింపు పొందాడు. ఇంటర్ వరకు విద్యనభ్యసించిన అతను 2010వ సంవత్సరంలో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం పొంది తన కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 2014లో జరిగిన ఓ ప్రమాదంలో అన్వేష్ ఎడమ చేయిని తొలగించారు. దీంతో జీవితం అయోమయంగా మారింది. చిన్నతనం నుండి క్రీడలపై ఆసక్తి గల అన్వేష్ పారా దివ్యాంగుల క్రీడా పోటీల గురించి తెలుసుకొన్నాడు. తనకు ఉన్న అవయవ లోపాన్ని సైతం లెక్కచేయకుండా క్రీడా పోటీల్లో పాల్గొనాలని నిర్ణయం తీసుకున్నాడు. ఆ సమయంలో స్నేహితులు, చుట్టుపక్కల వారు దివ్యాంగుడవి.. క్రీడాపోటీల్లో రాణించడం కష్టమని..చెప్పినా.. ఎలాగైనా తాను క్రీడల్లో రాణించి సత్తా చాటాలనుకున్నాడు. ఆత్మవిశ్వాసంతో పారా దివ్యాంగుల క్రీడా పోటీల్లో పాల్గొన్నాడు. ఇందుకు భార్య జ్యోత్స్న, తల్లి మరియమ్మ ఎంతో తోడ్పాటు అందించారు.

రాష్ట్రస్థాయిలో పతకాలు

ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూనే.. కుటుంబాన్ని పోషిస్తూ పలు క్రీడా పోటీల్లో పాల్గొని గుర్తింపు పొందాడు.

స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ దేవసేనమ్మ సన్మానం

2020 సంవత్సరంలో జరిగిన పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో షాట్ పుట్ లో ప్రథమ స్థానం, డిస్కస్‌త్రోలో ద్వితీయ స్థానం సాధించాడు. 2021లో అనంతపురంలో జరిగిన పోటీల్లో 2 రజత పతకాలు కైవసం చేసుకున్నాడు. ఆత్మస్థైర్యంతో క్రీడల్లో రాణిస్తున్న అన్వేష్‌ను మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ దేవసేనమ్మ, పట్టణ ప్రముఖులు అభినందించారు.

జాతీయ స్థాయిలో విజయం సాధిస్తా

ప్రమాదంలో చేయి కోల్పోవడంతో జీవితంలో నిరుత్సాహ పడలేదు. పారా స్పోర్ట్స్ గురించి తెలుసుకొని ఆత్మవిశ్వాసం.. పట్టుదలతో ఎలాగైనా క్రీడలలో గుర్తింపు సాధించాలని నిర్ణయించుకున్నా. ఎంతో శ్రమపడి క్రీడలు ప్రాక్టీస్ చేసి విజయం సాధించాను. దివ్యాంగుల్లోనూ టాలెంట్ ఉంటుంది. మానసికంగా కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు నడవాలి. నా లక్ష్యం జాతీయ స్థాయిలో క్రీడాపోటీల్లో రాణించి భారత దేశానికి గుర్తింపు తీసుకురావడం.

- అన్వేష్, క్రీడాకారుడు, గూడూరు

22న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి సమీపంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జూన్ 22వ తేదీ కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. శ్రీవారి సాలకట్ల సాక్షాత్కార వైభవోత్సవాలు జూన్ 24 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్న విషయం తెలిసిందే. ఈ ఉత్సవానికి ముందు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా మంగళవారం తెల్లవారుజామున సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి తోమాలసేవ, కొలువు, పంచాంగశ్రవణం నిర్వహిస్తారు. ఉదయం 6 నుండి 11.30 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఇందులో ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. మధ్యాహ్నం 12.30 గంటల నుండి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఏపీ ఫైబర్‌ను కాపాడుకుందాం..!

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వినోదాన్ని అందించాలన్న ఉద్దేశంతో డిజిటల్ ఇండియా కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2016లో అప్పటి ప్రభుత్వం ఏపీ ఫైబర్ నెట్ ను తీసుకొచ్చిందని, నేడు అధికారంలో ఉన్న ప్రభుత్వ పెద్దలు ప్రణాళికాబద్ధంగా ఏపీ ఫైబర్ ను నిర్వీర్యం చేయాలని కుట్రలు చేస్తున్నారని ఏపీ ఫైబర్ ఆపరేటర్ల జేసీసీ రాష్ట్ర కార్యదర్శి పెరుమాళ్ మధు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు వారికి ఉన్నత చదువుల అవసరం నిమిత్తం రూ.235 లకే నెట్, టీవీ ఛానల్‌లు, ల్యాండ్ లైన్ కనెక్షన్‌ను ఆనాటి ప్రభుత్వం అందించిందన్నారు. ఇన్నేళ్లుగా ప్రజలకు తక్కువ ధరకే సేవలందిస్తున్న ఏపీ ఫైబర్ ను నిర్వీర్యం చేసే దిశగా సంస్థ నిర్వాహకులు వ్యవహరిస్తున్నారన్నారు. దీనికి నిరసనగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు వినోదాన్ని అందించే ఏపీ ఫైబర్ ను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనంద్, శంకర్, జగదీష్ పాల్గొన్నారు.

గొడవలకు కారకులైతే చట్టరీత్యా చర్యలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఎక్కడైనా గొడవలకు కారకులైతే వెంటనే చర్యలు తీసుకుంటామని పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని రౌడీషీటర్లతో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ మంచిగా మెలగాలని.. ఎక్కడైనా సమావేశాలు, శుభకార్యాలు జరిగిన చోట గొడవలు వేసినట్లయితే చర్యలు తీసుకుంటామని.. ఎప్పుడు పిలిచినా స్టేషన్లకు హాజరుకావాలని తెలిపారు. సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ మోహన్, ఏఎస్ఐ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రణాళికతో పనిచేస్తేనే విజయం

ప్రజాశక్తి-క్యాంపస్: ఎన్నికలకు ఎక్కువ సమయం లేదని... ఇకపై పార్టీ నాయకులు, బూత్ కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌లు మరింత దూకుడు పెంచాలని తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రామచంద్రాపురంలో పి.వి.పురం పంచాయితీలో తెలుగుదేశం పార్టీ నాయకుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పులివర్తి సుధారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రానున్న 9 నెలల కాలం పార్టీకి అత్యంత కీలకమని, అలసత్వం వీడి పక్కా ప్రణాళికతో పని చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా పరిశీలన, పార్టీ కార్యక్రమాల నిర్వహణ, నాయకుల పనితీరుపై ప్రధానంగా చర్చించారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంపై తీసుకోవాల్సిన చర్యలపై ఆయా నాయకులకు దిశానిర్దేశం చేశారు. నాలుగేళ్ల పాలనలో వైకాపా ప్రభుత్వం

ఒక్క పని కూడా చేయలేదని, ప్రజల సమస్యలను పూర్తిగా గాలికి వదిలేసిన అంశాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలన్నారు. కలిసికట్టుగా సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీటీడీ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల హక్కుల సాధనకై ఐక్యత చాటుదాం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): దేశవ్యాప్తంగా, ఇటు రాష్ట్రవ్యాప్తంగా జనాభా దామాషాలో అత్యధిక శాతం బీసీలు ఉన్న రాజ్యాధికారం, పదవులు, హక్కులను సాధించు కోవడంలో వెనకబడే ఉన్నామని ఐక్యంగా ఉండి హక్కుల సాధనకై కషి చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకర్రావు పిలుపునిచ్చారు. ఆదివారం తిరుపతి నగర పరిధిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆగస్టు 7న నిర్వహించనున్న జాతీయ ఓబిసి మహాసభను జయప్రదం చేయడానికి తిరుపతి జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజ గౌడ్ ఆధ్వర్యంలో బీసీ సంఘం ముఖ్య నేతలు, జిల్లా అధ్యక్షులతో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ బలియమైన బీసీలు కేవలం ఓటర్లుగా మాత్రమే గుర్తింపు పొందుతున్నారని, రాజకీయ బలోపేతంతోనే బీసీల హక్కులు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. ఇదే ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం నుండి నాయకులుగా ఎదిగిన వారు ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు ఇలా అనేక పదవులు అనుభవించారని గుర్తు చేశారు. జాతీయ ఓబీసీ మహాసభకు అత్యధిక సంఖ్యలో బీసీలు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

మహాసభకు రాయలసీమ నియోజకవర్గాల్లో నుండి బీసీలు హాజరయ్యేందుకు సభ లక్ష్యాలను కరపత్రాలుగా అందిస్తూ ప్రచార రథాల ద్వారా ప్రజలకు తెలియజేయాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్కే యాదవ్, వెంకటేశ్వర్లు, రఘుపతి, జ్ఞాన జగదీష్, బ్రహ్మానంద శర్మ, చంద్రశేఖర్, తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు మధు ఆచారి, నాగేంద్ర, జయచంద్ర రాయలసీమ పరిధిలోని నూతన జిల్లాల అధ్యక్షులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై ఆర్డీవో పరిశీలన

ప్రజాశక్తి-పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని తాళ్లాయిపాడు ,శిరసనంబేడు గ్రామాల వద్ద ఉన్న లేఅవుట్లను ఆదివారం సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని పరిశీలించారు. ఈ సందర్భంగా తాళ్లాయిపాడు గ్రామం వద్ద టాపే ట్రాక్టర్ షోరూమ్ వెనక ఉన్న అక్రమ లే అవుట్‌లో ప్రభుత్వ భూమిలో అక్రమంగా వేసి ఉన్న రోడ్డును ఆయన పరిశీలించారు. కారకులైన వారిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దారు రామయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసెట్ ఫలితాలలో విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ,ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ లో గూడూరు పట్టణంలోని శివాని స్టడీ సర్కిల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కరస్పాండెంట్ ఎం.శివ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఎం.పూజిత 8953 వ ర్యాంక్ , పి.నికిత 9497, 15వేల లోపు 6 మంది, 20 వే ల లోపు 9 మంది , 25 వేల లోపు 14 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల అభ్యున్నతే లక్ష్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని భవన నిర్మాణ కార్మిక సంఘం సి.ఐ.టి.యు ఆధ్వర్యంలో ఆదివారం వివేకానంద రోడ్డులోని భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.డి రఫీ, సేలం, శేఖరాచారి అధ్యక్షతన కార్మిక చిత్రపటానికి పూలమాల వేసి 27 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు,

వ్యవస్థాపకుడు పుట్టా శంకరయ్య, సహాయ కార్యదర్శి జి.మధు, సహాయ అధ్యక్షుడు పర్వతాల శివయ్య, కమిటీ సభ్యులు బండి.కిష్టయ్య, కువైట్ బాబు, నాగేంద్ర, బి. లక్ష్మయ్య, సారథి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం కూలీలపై దాడులు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: చామలరేంజ్ అటవీ ప్రాంతంలో భాకరాపేట చామల సెక్షన్ అటవీ సిబ్బంది, ప్రొటెక్షన్ వాచర్లు భాకరాపేట బీట్‌లో శనివారం సాయంత్రం కూంబింగ్ నిర్వహించారు. రవాణా చేసేందుకు దుంగలను మోసు కొస్తున్న ఎర్రచందనం కూలీలు తమను గమనించి దుంగలు వదిలి పారిపోయారని ఫారెస్ట్ రేంజ్ అధికారి దత్తాత్రేయ తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించగా పదహారు దుంగలు గుర్తించారు. వీటి బరువు 247 కేజీలు ఉండగా.. వీటి విలువ సుమారు రూ.4.5 లక్షలు ఉంటుందన్నారు. పారిపోయిన కూలీలు, స్మగ్లర్లను పట్టుకొనేందుకు గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కూబింగ్ లో చామల సెక్షన్ ఆఫీసర్ ఎస్సార్ తౌఫిక్, భాకరాపేట బీట్ ఆఫీసర్ ఎమ్.సదాశివయ్య, దేవరకొండ బీట్ ఆఫీసర్ కె.లోకనాథం, డ్రైవర్ వి.శివకుమార్, ప్రొటెక్షన్ వాచర్లు వి.శివకుమార్, వి.శ్రీని వాసులు, శ్రీనివాసులు, పి.చంద్రశేఖర్, సురేంద్ర పాల్గొన్నారు.

మహిళపై హత్యాయత్నం

ప్రజాశక్తి-వెంకటగిరి: నెర్నూరు ఎస్టీ కాలనీకి చెందిన మహిళపై హత్యాయత్నం చేసి ముళ్లపొదల్లో వేసిన సంఘటన ఆదివారం రాత్రి సాయంత్రం వెలుగులోకి వచ్చింది. శాంతమ్మగా పోలీసులు గుర్తించారు. పోలీసుల కథనం మేరకు.. డక్కిలి మండలంలోని దగ్గవోలు సబ్‌స్టేషన్ సమీపంలో రోడ్డు పక్కన మహిళ రక్తపు మడుగులో ఉండడాన్ని గొర్రెల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఆమెను వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్యే కిలివేటి సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి-ఓజిలి: సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మండుటెండను సైతం లెక్కచేయకుండా వరుసగా మూడు రోజులుగా కర్రబల్లవోలు , పున్నేపల్లి, గ్రద్దగుంట సచివాలయ పరిధిలో సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఆదివారం మండల పరిధిలోని గ్రద్దగుంట సచివాలయం పరిధిలోని గ్రామాల్లో వైసిపి సీనియర్ నాయకుడు మొక్కపాటి ప్రసాద్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పాల్గొని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా చూడాలని అధికారులకు సూచనలు ఇస్తున్నారు. గ్రామాల్లో వివిధ సమస్యలకు పరిష్కారం మార్గం చూపుతూ ముందుకు సాగుతున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు గుంటుమడుగు రవీంద్రరాజు, కో ఆప్షన్ సభ్యులు షేక్ ఖాదర్‌బాషా, సురేష్ రెడ్డి, పాదర్తి హరినాథ్ రెడ్డి, వేణు రెడ్డి, మహేంద్రరెడ్డి, రాజారాంరెడ్డి, ఎంపీడీవో వి.రజనీకాంత్ , నాయుడుపేట రూరల్ సీఐ వైవి.సోమయ్య, ఎస్ఐ దారం ఆదిలక్ష్మి, దాసరి మహేష్, పి శివ, ఎస్.అల్లేయ్య, పి వెంకటేశ్వర్లు, పి.పెంచలయ్య, వెంకట కృష్ణయ్య, క్రిష్టయ్య పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం: వరదయ్యపాలెం మండలం జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు, కార్యకర్తలు హాజరయ్యారు. చిరంజీవి యాదవ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి లో పార్టీని బలోపేతం చేయాలని, ప్రతి పంచాయతీలో జనసేన జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు జరగాలన్నారు. అలాగే ప్రతి గ్రామంలో బూత్ స్థాయి కమిటీ, పంచాయతీ కమిటీ మండల అనుబంధ కమిటీలు వేసి ప్రజల్లోకి వెళ్లాలని తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు శేఖర్, తులసి, కేశవ, శ్రీధర్, నవీన్, వెంకటేష్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణి ట్రస్ట్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తూ స్వామి వారితో ఆటలాడుకుంటున్నారని శ్రీవారి ట్రస్ట్ పేరుతో వసూలు చేసిన సొమ్ము పై అధికారులు శ్వేత పత్రం విడుదల చేయాలని తిరుపతి జనసేన పార్టీ బాధ్యులు కిరణ్ రాయల్ డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.10,500 వసూలు చేస్తున్న శ్రీవాణి ట్రస్ట్ టిక్కెట్‌కు రసీదు ఎందుకు ఇవ్వరని అధికారులను ప్రశ్నించారు. శ్రీవాణి ట్రస్టు పేరుతో పోగు చేసిన నిధులతో రూ.10 లక్షలు వెచ్చించి 12 వేల ఆలయాలను నిర్మిస్తున్నామని అధికారులు చెప్పారన్నారు. అయితే 12 వేల ఆలయాలు ఎక్కడ ఉన్నాయి? ఏ దశలో నిర్మాణాలు జరుగుతున్నాయో బహిరంగ పరచాలని డిమాండ్ చేశారు. శ్రీవాణి ట్రస్టు నిధుల వినియోగంపై వెంటనే శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాజారెడ్డి, బాబ్జి, మునుస్వామి, రాజేష్ ఆచారి, హిమవంత్, కిరణ్, సుజిత్, వినోద్ పాల్గొన్నారు.